
# మోసం

గరికపాటి కృష్ణమూర్తి



సాయంకాలం ఆరుగంటలైంది పిల్లలు వీధుల్లో కబాడీ ఆడుకుంటున్నారు. పెద్దలు రచ్చబండమీద పిచ్చాపాటీలో ఉన్నారు.

ఇంతలో సడన్‌గా టాక్సీ వచ్చి ఆగింది పిల్లలు ఆట ఆపేశారు. బిలబిలమంటూ చుట్టూ మూగారు. పెద్దవాళ్ల గౌరవంకొద్దీ రచ్చబండనుండి పై పంచెలు దులుపుకుంటూ దిగారు.

"వెధవ మూక. ఊళ్లోకి యెవర్నీ రానీరు. ఈగల్లా మూగేస్తారు. ఛదవల్లారా... పొండి... పొండి" గదమాయించా డొకాయన.

టాక్సీనుండి యిద్దరు దిగారు. ఖరీదైన సూటు బూటుల్లో ఉన్నారు. పెద్దవాళ్లలా కన్పిస్తున్నారు.

"ఎవరు కావాలి బాబూ!" ఓ పెద్దాయన అడిగాడు.

"మీరే."

"మళ్ళీ ఎలక్షన్లు వచ్చినయ్యా?" యింకో ముసలాయన అందుకున్నాడు. ఆయన అనుభవంలో యిటువంటి చిన్న కార్లు ఎన్నికలప్పుడే ఇప్పుడప్పుడూ వస్తూ ఉంటయ్

"అబ్బే మేం రాజకీయవేత్తలం కాదండి. బ్యాంకు ఉద్యోగులం."

"రండి బాబూ రండి."

గుళ్ళో చాప తెప్పించి రచ్చబండ మీద పరిచారు.

ఇద్దరూ కూర్చున్నారు.

రైతులందరూ పై పంచెలేసుకొని క్రింద చతికిలబడ్డారు. వాళ్లేమి చెప్తారో నని కళ్లప్పగించి చూస్తున్నారు

"మీ వూళ్ళో రేడియో ఉందా?" అందులో ఒకాయన అడిగాడు.

"పంచాయతీ కుందండీ."

"సరే! దాంట్లో రోజూ మీరు వింటూనే ఉండి ఉంటారు. ప్రభుత్వం స్వయం ఉపాధిపథకా లెన్నింటినో తయారుచేసింది చిన్నకారు—సన్నకారు రైతులకు రుణసౌకర్యాలు కల్పిస్తుంది. ఆ అప్పులను మా బ్యాంకు ద్వారా మీరు తీసుకోవచ్చు. ఆ అప్పుతో మీ రేదైనా వృత్తిని చేపట్టి అదనంగా ఆదాయాభి వృద్ధి చేసుకొనటానికి వీలుంది. అందు కోసమే మేం వచ్చాం."

"కొంచెం విడమరచి చెప్పండయ్య గారూ!'' అందులో అప్పల నర్సింహులు అందుకున్నాడు.

"దీంట్లో విడమరచి చెప్పేదేముం దయ్యా! మీలో చాలామందికి సంవత్సరంలో చాలాకాలం యే వ్యాపకమూ ఉండదు. ఏదో ఒకటి కల్పించుకుందా మన్నా డబ్బుండదు ఆ డబ్బునేదాన్ని ప్రభుత్వం కల్పిస్తే పిచ్చాపాటీతో వృధాగా వెళ్లబుచ్చే కాలాన్ని అటు సద్వినియోగపరచుకున్నట్లూ అవుతుంది. యిటు ఆదాయాని కాదాయం లభిస్తుంది." రెండో ఉద్యోగి విడమరచ గల్గినంత విడమరచి చెప్పాడు

"ఔను బాబూ! ఆ డబ్బు లేకనేగా మొక్కలకి యెరువు లేసుకో లేక పోతున్నాం.''

"ఇది యెరువులకిచ్చే రుణంగాదు తాతగారూ! కాని మేం చెప్పినట్లు మీరు నడచుకోగల్గితే ఫ్లోట్ యెరువులే గాదు... మీ ఆడవారికి నగలూ నట్రా కూడా చేయించుకోగలరు.''

"చెప్పండి బాబూ! దేవుళ్లాగ వచ్చారు.''

అప్పల నర్సింహులుకు అప్పు అవసరం చాలా ఉన్నది. ఎక్కడన్నా చేద్దామన్నా యెవరూ యివ్వటంలేదు.

"షీరాక పాడిగేదెను కొనుక్కున్నా రనుకోండి. దాని ఖరీదు మే మిస్తాం. పాలమ్మి మీరు కొంత మిగుల్చుకుంటూ

మా బాకీని నెలకింతని మాకు కడుతూ వుండాలి.''

"మా వూళ్ళో ఇప్పుడున్న పొలనే యెవరూ కొనటంలేదుగా" వెనకనుండి యెవరో కుర్రాడు అందుకున్నాడు.

"నువ్వెందరా వెధవ సన్నాసి." విసిరికొట్టాడు అప్పలనర్సింహులు.

వాడు మళ్ళీ మాట్లాడలేదు.

అప్పలనర్సింహులుమీద వారికి గురి కుదిరింది.

వాళ్లలో నోరున్నవాడిలా తోచాడు.

''మీ పేరేమిటన్నారు ?''

''అప్పలనర్సింహులండి."

''అప్పలనర్సింహులుగారూ ! మీ వంటి వారు ముందుగా ముందుకువచ్చి చేసి చూపిస్తే గని మిగతావారికి నమ్మకం చిక్కదు. మీ కటువంటి అవసరముందో లేదో మాకు తెలియదనుకోండి. మీలాగా ముందుకు వచ్చేవాడుంటే తీసుకొని రండి. చేసి చూపిద్దాం. పాలకొనే బూత్ కూడా యిక్కడే పెట్టిద్దాం.''

"అమ్మమ్మ ! యెంతమాట. ఎవరో యెందుకండి, మీరు దయతలచాలేగాని నేనే తీసుకుంటాను. బాకీ తీర్చే సంగతంటారా ? నెలనెలా పువ్వుల్లో పెట్టి మీ కందజేస్తాను."

"మరి మేమిచ్చేదానికి హామీ ఉండాలే."

"అలాగే. నేనుకొంచెం పొలం పుట్రా ఉన్నవాణ్ణేనండి."

"ఇదివరకు ఒక పొలాన్ని హామీగా పెట్టామనుకోండి. దాన్నే మళ్ళీ మీరు హామీకి తీసుకుంటారా ?''

"నువ్వెందరా సుబ్బన్నా ! వెధవ వాగుడూ నువ్వూనూ," కసిరేశాడు అప్పలనర్సింహులు.

సుబ్బన్నకా సందేహం యెందుకొచ్చిందో తెల్సు. నర్సింహులు పొలం తనఖాలో ఉన్నది. తనకు మళ్లీ దాని మీదే అప్పురావటం వాడి కిష్టంలేదు. చేనుగట్టు రైతు. వాడికంటే తన పొలాలు బాగోకూడదు. బాగుండటానికి యెరువులు కావాలి. వాడికి దొరకని అప్పు తనకూ దొరకగూడదు. అదెక్కడ తను కొట్టేస్తేనోనని వాడి బాధ.

వెధవాగుడన్నందుకు సుబ్బన్నకు కోపం వచ్చిందిగాని, నర్సింహులు నోరు మంచిదిగాదు. పెంటమీద రాయి విసిరినట్టే.

''వారెవరనుకున్నావ్. బ్యాంకు ఆఫీసర్లు, మున్సబ్ కరణాల దగ్గర అంతా వాకబు చేస్తారు. తర్వాతనే యిస్తారు లోను. తెల్సిందా" గదమాయించేశాడు నర్సింహులు.

బ్యాంకు అధికారులకు నర్సింహులు మీద మరింత విశ్వాసం కుదిరింది.

నలుగురిని పోగుచేయగలడు. కాస్త

చేతుల్నికూడా తడిపే చాకచక్యంగల వాడిలా తోచాడు

"మీతో అప్పులు కావాల్సిన వాళ్లం దరూ నర్సింహులుగారికి పేర్లివ్వండి. రేపు ఫారాలు తెచ్చి పూర్తిచేస్తాం. కరణంగారిని కూడా ఊళ్లో ఉండేటట్లు చూసుకోండి." బయలుదేరటానికి లేస్తూ అన్నాడొకాయన.

"బాబుగార్ల కొక మనవి. మావూరు చాలా బీదది. అందరూ ఐదెకరాల లోపున్న సన్నకారు కష్టజీవులం. మా యందు దయవుంచి యెరువులకు కూడా అప్పులిచ్చేటట్లు చూడండి బాబూ!" ఒక ముసలాయన ప్రాధేయపూర్వకంగా విన్నవించుకొన్నాడు.

"చెప్పాంగదా తాతా! యెరువులకు లోన్లు యిచ్చేవాళ్లం గాదని. స్వయం ఉపాధి పథకాలకే యిస్తాం. కిరాణా కొట్లో, సైకిల్‌షాపో, బట్టలకొట్టో, ఎడ్లూ-బండికో, పాడిగేదెలకో- యిటు వంటి వాటిల్లో దేనికో ఒకదానికి పెట్టు కోండి తప్పకుండా చూస్తాం."

ఇంకా రెండుమూడూళ్లు చూడాలని యిక టైం లేదని యిద్దరూ లేచారు.

కాఫీ అయినా యివ్వాం గాదని, రెండు మజ్జిగగ్లాసులు తీసుకొచ్చి యిచ్చారు.

అప్పులనర్సింహుల్ని అవతలకు తీసుకెళ్ళి, అసలు విషయాన్ని చెప్పాడొకాయన. జాగ్రత్తగా, అల్లరికాకుండా చూడాలని హెచ్చరించాడు.

అప్పులనర్సింహులు పరమానంద భరితుడయ్యాడు.

ఆ ఆఫీసర్లు వెళ్ళిపోయిన తర్వాత కొంతసేపు వాళ్లలాగానే ఫీలయ్యాడు.

అప్పులవసరమున్న వాళ్లందరూ అప్పులనర్సింహులు చుట్టూ చేరారు. ఆ కాసేపు అప్పుల నర్సింహులే అయ్యాడు.

గుడ్డి లాంతరొకటి తెప్పించాడు పేర్లు, కావల్సిన మొత్తాన్ని రాసేశాడు. కాస్త యెక్కువ అడిగినవాడిని అక్కడి కక్కడే చివాట్లుపెట్టి తగ్గించేశాడు. ఇష్ట మైనవాళ్లకి కొంచెం పెద్ద మొత్తాల్నే వేశాడు.

కాని అప్పులనర్సింహులుకో అను మానం వచ్చింది. ఎరువులకైతే ససేమిరా యివ్వనన్నారు. తనకిగాదు ఊళ్లో వాళ్లందరికి కావల్సింది దేనికో దానికి అప్పు దొరుకుతుంది గదా అన్న ఆశ ఒకవైపున్నా ఊరంతా ఎగబడితే తను చివరకు నిలబడలేమో నన్న సందేహం కల్గింది. ఉన్న పొలం కాస్తా యిదివరకే తనఖాలో ఉన్నది. మళ్ళీ దానిమీదే యివ్వమంటే యివ్వరు పైపెచ్చు తనకంటే యెక్కువ ఉన్నవాళ్లు, యెప్పుడూ ఎక్కడా అప్పెరగనివాళ్లూ యెగబడుతున్నారు. వీళ్లందరూ వస్తే తన నోట్లో సున్నమే!

విలైనంతమందిని తగ్గించెస తనటు వంటి వాళ్లు నలుగురికి ముందుగా ప్రయత్నం చేస్తే బాగుంటుందను కొన్నాడు. తనకు ముట్టిన తర్వాత మిగతావాళ్లకి ప్రయత్నం చేయొచ్చు. ఒకవేళ తర్వాత బెడిసికొట్టినా ఫరవా లేదు. తను ఒడ్డున పడతాడు.

ఈ ఆలోచన రాగానే రాసిన పేర్లలో ఆ వంకమీద- యీ వంకమీద సగానికి సగం పేర్లు కొట్టేశాడు. ఎరువుల కసలు అప్పే లేదన్నాడు.

కాగాపోగా లిస్టును ఆఖరిలో నాలుగు పేర్లకు వదబోసాడు ఒకటి కిరాణా షాపు మరొకటి ఎడ్లూ-బండి, రెండు పాడిగేదెలకు- పాడిగేదలకు రాసిన పేర్లలో ఒకటి తనది, మరొకటి తన బామ్మర్దిది.

ఆ తర్వాత, నలుగురినీ ప్రక్కకు పిలిచి రహస్యంగా మంతనాలాడాడు. 'ఓ అలాగే' అన్నారు.

అనుకొన్నట్లుగానే మర్నాడు పయం పదిగంటల ప్రాంతంలో ఆ యిద్దరాఫీ సర్లు వచ్చారు.

అప్పలనర్సింహులు- మిగతా ముగ్గురు యెదురేగి స్వాగతం పలికారు.

కాఫీ పలహారాలు యేర్పాటుచేశారు.

ఒక ఆఫీసర్ లోను అప్లికేషన్ ఫారాన్ని పూర్తిచేశారు.

కరణం దగ్గర కెళ్లారు. అడంగులు చూశారు. అప్పలనర్సింహులు ఆ మిగతా ముగ్గురికి ఫలాన సర్వేనంబర్లలో గల భూములు వారివేనని కరణంకూడా సర్టిఫై చేశాడు.

పని పూర్తి కాగానే అప్పలనర్సింహులు వారి నక్కడ క్షణం కూర్చోనీయ లేదు. ఇవతలకు తీసుకొచ్చేశాడు. ఎవరూ లేకుండా చూసి నాలుగు లోన్లకు నాలుగు ఏభైలు రెండొందలు చేతిలో పెట్టాడు.

"ఇదేంటి?"

"బాబ్బాబు ! ఇప్పటికిది ఉంచండి. మీరా డబ్బు యివ్వగానే మిగతాది పూటలో పెట్టి యిస్తాను, నా మాట నమ్మండి.'' బ్రతిమాలాడు.

"మేం డబ్బు యిస్తామని యెవరు చెప్పారు?"

అప్పలనర్సింహులు ఆశ్చర్య పోయాడు. మిగతావాళ్లు తెల్లమొహాలేశారు.

ఆఫీసర్లలో ఒకాయన పకాపకా నవ్వాడు.

"మేం డబ్బులియ్యమయ్యా ! చెక్ లిస్తాం. వాటిని మీరు బ్యాంకుకెళ్లి మార్చుకోవాలి."

"అవికూడా మీకివ్వం. మీరు గేదెను యెవరిదగ్గరైతే కొన్నారో ఆయన కిస్తాం. గేదె మీకు, డబ్బు అమ్మినవాళ్లకి."

ఆఫీసర్లలో మరొకాయన అందు కొన్నాడు.




"రేపు రంగాపురంలో పశువులసంత ఉన్నది. మీరిద్దరూ అక్కడకు రండి. మిగతా యిద్దరు యెల్లుండి టౌనుకొద్దురు గాని. ఒక్కొక్క గేదెకు పదిహేను వందలిస్తాం. సంతలో నచ్చిన గేదెను ఎన్నిక చేసుకోండి. ఆ గేదెనమ్మినాయనకు చెక్ యిస్తాం. ఆయన దానిని బ్యాంకులో మార్చుకొన్న తర్వాత మీరు మీ గేదెను తోలుకు తెచ్చుకోండి."

బాగానే ఉందన్నారు అందరూ.

"మిగిలింది రేపు తీసుకురావటం మర్చిపోయేరు సుమా!" మళ్ళీ హెచ్చరించి మరీ కారెక్కారు.

వారు చెప్పిన ప్రకారం నర్సింహులు- బావమరిదీ యిద్దరూ మర్నాడు రంగాపురం సంత కెళ్లారు.

కాసేపటికి ఆ యిద్దరాఫీసర్లు కారులో దిగారు.

"రండిబాబు రండి. మీ కోసమే ఎదురుచూస్తున్నాం. మీరొచ్చే లోపలే మా సెలక్షను అయిపోయింది."

వారిద్దర్నీ ఆ రెండు గేదెలున్న చోటికి తీసికెళ్లాడు

తీసుకెళ్తూనే ఆ రెండూ తమకెందుకు నచ్చాయో వివరించి చెప్పేశాడు. ఆఫీసర్లకూ నచ్చినయ్.

నర్సింహులు-వాళ్లూ బేరాల్లో దిగారు. ఒకోదానిని పదిహేడు వందలు

చెప్పారు. పదహారువందలకొచ్చారు. ఆ తర్వాత మరో యాభై తగ్గించారు. ఆఖరికి ఆ పదిహేనువందల చొప్పునే వాటిని తమవి అనిపించుకొన్నారు.

బేరం ముగిసిన తర్వాత మా సంగతేమిటన్నట్లు చూశాడాకాయన.

నర్సింహులు కూడా యిక తప్పదన్నట్లు "మాట తప్పుతానాండి. అది నా యింటావంటా లేదంటూ" మిగతా వంద చేతిలో పెట్టాడు.

ఆ డబ్బు చేతిలోపడ్డ తర్వాతనే రెండు చెక్కులూ యిచ్చారు. అప్పల నర్సింహులు ఆ రెండు చెక్కుల్ని కళ్ళకద్దుకొని మరీ గేదెల్ని అమ్మిన వాళ్ళకు అందజేశాడు. వారా చెక్కుల్ని బ్యాంకులో మార్చుకొని డబ్బు చేతిలో పడ్డతర్వాత అప్పలనర్సింహులు — బావమరిదీ ఆ గేదెలను తోలుకెళ్ళాలి. అదీ ఒప్పందం.

* * *

"బావా ! నీ వింత టోకరా యిస్తావనుకోలేదు సుమీ ? శ్రీకృష్ణపరమాత్మ చెప్పినట్లు యీ గేదెలను అమ్మిన వాళ్ళమూ మనమే — కొన్నవాళ్ళమూ మనమే — ఆఖరికి ఆ గేదెలు కూడా మన దొడ్లోవేనని ఆ బ్యాంకు ఆఫీసర్లకి తెలియదు పాపం ! నాటకాన్ని బాగా ఆడించేశావు, పో."

హోటల్లో కాఫీతాగుతూ బావ అప్పల నర్సింహులు తెలివితేటల్ని తెగ మెచ్చేసుకుంటున్నాడు బావమరిది.

"లేకపోతే ఎలా బతుకుతాంరా సన్యాసి. మనకు కావల్సిందా వాళ్ళివ్వరు. వాళ్ళిచ్చేదా మన కవసరంలేదు. అందుకే యీ పన్నాగం పన్నాను. పారింది...రేపు బ్యాంకులో డబ్బు మార్చుకొని అలా యెరువులు యెత్తించుకొస్తా" అంటున్నాడు అప్పల నర్సింహులు.

ఓ మూల కూర్చుని యీ సంభాషణంతా వింటున్న బ్యాంకు ఆఫీసర్లు ఆశ్చర్యపడిపోయారు. 'ఔరా' అనుకున్నారు.

తేరుకొని ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"అవి చెల్లని చెక్కులని రేపుగాని తెలియదు పాపం" అనుకొంటూ ముసిముసి నవ్వులు నవ్వుకొన్నారు యిద్దరు నకిలీబ్యాంకు ఆఫీసర్లు..

